క్లుప్తంగా

కార్యకర్తకు వాసుపల్లి ఆర్థికసాయం



సీనియర్ కార్యకర్త సత్యవతిని పరామర్శిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం : ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ప్రజలు, కార్యకర్తలు తనకు ముఖ్యమని, తన సేవలు కొనసాగిస్తానని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. అందుకు నిదర్శనంగా ఆయన 33వ వార్డు పిల్లివారివీధికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త కొల్లు సత్యవతి అనారోగ్యంతో బాధపడుతుందని తెలుసుకుని శనివారం పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఆమెను పరామర్శించారు. ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆమెకు రూ.10 వేలు ఆర్థిక సహకారం అందజేసి ధైర్యం చెప్పారు. కష్టంలో ఉన్న కార్యకర్తలకు తాను ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని తెలిపారు. బొడ్డేటి ప్రసాద్, వెంకటేశ్వరమెట్ట దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొడ్డేటి ప్రసాద్, లండా రమణ, కర్రి నీలకంఠం, రమేష్, వాసుపల్లి నారాయణతో తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గుస్టేషన్ల పనితీరుపై సమీక్ష



దక్షిణ ప్రాంత ఎన్టీపీసీ స్టేషన్ల అధికార బృందంతో డైరెక్టర్ రవీంద్రకుమార్

పరవాడ: ఎన్టీపీసీ సింహాద్రిలో దక్షిణ ప్రాంత స్టేషన్ల త్రైమాసిక పనితీరుపై శుక్రవారం ఎన్టీపీసీ ఆపరేషన్ డైరెక్టర్ ఎస్.హెచ్.రవీంద్రకుమార్ సమీక్ష నిర్వహించారు. అనంతరం అన్ని ఎస్.ఆర్.బొగ్గు స్టేషన్ల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రతపై దృష్టి కేంద్రీకరించడంతో పాక్షిక నష్టాలను తగ్గించడంపై అధికారులకు సూచనలు చేశారు. ప్రేమ్‌ప్రకాష్ ఆర్ ఈడీ(సౌత్), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఓఎస్) అరిందమ్ సిన్హా, ఈడీ విజయప్రకాష్ (సేఫ్టీ ఓసీ), ఈడీ కేఆర్ పాండు (రామగుండం), సింహాద్రి సీజీఎం ఎస్.కె.సిన్హా, కుడ్గి సీజీఎం బి.ఎన్.ఝా, ఏకే మనోహర్ (ఎన్టీఈసీఎల్, వల్లూర్) పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మద్దిలపాలెం : మద్దిలపాలెం కూడలిలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ముఖద్వారం సమీపంలో ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన శ్రీ గురు విశ్వస్ఫూర్తి ట్రస్ట్ చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. రెండు నెలలుగా చలివేంద్రం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. రెండు రోజులుగా ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

భవితకు దిక్సూచి

మంచి పుస్తకం.. చక్కని స్నేహితుడి వంటిదనేది గొప్ప నానుడి. పుస్తక పఠనం పట్ల ఆసక్తి తగ్గుతున్న ఈ ఆధునిక కాలంలో గ్రంథాలయాల వల్లే చదువరుల్లో పఠనాసక్తి తగ్గకుండా ఉంది. దానిని నిరూపిస్తూ అల్లిపురం శాఖా గ్రంథాలయం పాఠకులు, విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే వారికి చక్కటి సేవలందిస్తోంది. అన్ని రకాల పుస్తకాలు కొలువుదీరిన ఈ గ్రంథాలయం సేవలను అందరూ వినియోగించుకోవాలని ఇక్కడి గ్రంథాలయాధికారి కోరుతున్నారు.



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థుల కోసం సిద్ధంగా ఉన్న కాంపిటీటివ్ పుస్తకాలు

- కాంపిటీటివ్ పుస్తకాలు కొలువుదీరిన అల్లిపురం శాఖా గ్రంథాలయం
- పెద్ద సంఖ్యలో హాజరై పుస్తక పఠనం చేస్తున్న పాఠకులు.. విద్యార్థులు
- కోరిన పుస్తకాలు సమకూరుస్తామని గ్రంథాలయాధికారి భరోసా

అల్లిపురం : నిరుద్యోగ యువతకు అల్లిపురం శాఖా గ్రంథాలయం దిక్సూచిగా నిలుస్తోంది. ప్రస్తుతం ఉద్యోగాలు పొందాలంటే తప్పనిసరిగా ఇతరులతో పోటీ పడాల్సిందే. అందుకు ఎంతో ఖరీదైన పుస్తకాలు కొని చదువుకోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితిలో విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా గ్రంథాలయ సంస్థ అవసరమైన కాంపిటీటివ్ పుస్తకాలను సమకూర్చింది. ఇందుకు వేలాది రూపాయలు ఖర్చు చేసింది.

7200 పై చిలుకు పుస్తకాలు..

అల్లిపురం బాయమ్మ జంక్షన్‌లో జిల్లా గ్రంథాలయానికి అనుబంధంగా శాఖా గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ఈ గ్రంథాలయంలో ఇప్పటికే 6,300 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. వాటికి తోడుగా ఇటీవల మరో 975 కాంపిటీటివ్ పుస్తకాలు సమకూర్చినట్లు గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు తెలిపారు. వాటిలో బాల సాహిత్యం, పురాణ గ్రంథాలు, గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, విద్యార్థులు, కాంపిటీటివ్ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. త్వరలోనే మరికొన్ని పుస్తకాలు చేర్చనున్నట్లు తెలిపారు.



అల్లిపురం బాయమ్మ జంక్షన్‌లో గల శాఖా గ్రంథాలయం

తెరిచి ఉండే వేళలు..

ఈ గ్రంథాలయం ప్రతి రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు తెరిచి ఉంటుందని గ్రంథాలయాధికారి రాజు తెలిపారు. పేపర్ విభాగం దిగువ భాగంలోను, పుస్తక విభాగం మేడపైన నడుపుతున్నారు. ప్రతి శుక్రవారం సెలవు. మిగిలిన రోజుల్లో పాఠకులు, విద్యార్థులు, కాంపిటీటివ్ పరీక్షలకు హాజరయ్యే వారు కోరితే పుస్తక విభాగం తెరిచి ఉంచుతారు. పాఠకులు నవలల వంటి వాటిని ఇంటికి తీసుకెళ్లి చదువుకునే వెసులుబాటు కల్పించారు. అందుకు గాను రూ.100 డిపాజిట్ తీసుకుని అందజేస్తారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రంథాయాధికారి కోరుతున్నారు.

అన్ని రకాల పత్రికలు అందుబాటులో..



శాఖా గ్రంథాలయంలో అన్ని రకాల దిన, వార, పక్ష, మాస పత్రికలు లభిస్తున్నాయి. గ్రంథాలయానికి వచ్చి అన్ని రకాల పత్రికలు చదువుకోగలుగుతున్నాం. ఈ గ్రంథాలయాన్ని అందరూ వినియోగించుకుంటే బాగుంటుంది. పిల్లలు, పెద్దవాళ్లు, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి.

– పాల శ్రీహరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి

అవసరాన్ని బట్టి మరిన్ని పుస్తకాలు సమకూర్చుతాం..



ఇప్పటికే గ్రంథాలయంలో 7200కు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, కాంపిటీటివ్ పరీక్షలకు హాజరయ్యే వారికి కావాల్సిన అన్ని పుస్తకాలు సమకూర్చాం. ఎవరికైనా అవసరమైన పుస్తకాలు కావాలని చెబితే వాటిని కూడా సమకూరుస్తాం. కొత్తగా మరికొన్ని పుస్తకాలు త్వరలోనే గ్రంథాలయానికి రానున్నాయి.

– పీవీఎస్ రాజు, గ్రంథాలయాధికారి

పోటీ పరీక్షల మెటీరియల్ లభిస్తుంది..



నేను పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. అందుకు కావాల్సిన మెటీరియల్ గ్రంథాలయంలో లభిస్తోంది. ఇంకా మెటీరియల్ అవసరమైతే రప్పిస్తామని చెప్పారు. గ్రంథాలయంలో వాతావరణం బాగుంది. సిబ్బంది చక్కగా సహకరిస్తున్నారు. మాలాంటి వారికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

–ఎ.సంతోష్‌కుమార్, విద్యార్థి

పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి..



గ్రంథాలయంలో పాఠకులకు అవసరమైన పత్రికలన్నీ లభిస్తున్నాయి. సంవత్సర చందా సౌకర్యం కూడా ఉంది. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు లభ్యమవుతున్నాయి. ఈ అవకాశాన్ని కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యేవారు వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధిస్తారు.

- ఎస్.కె.లక్ష్మి

చురుగ్గా జోనల్ కార్యాలయం మరమ్మతు పనులు



జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతులు

సీతమ్మధార : ఆశీలమెట్టలోని అశోక్‌నగర్‌లో గల జీవీఎంసీ జోన్-3 కార్యాలయం మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఈ పనులను పరిశీలించి అధికారులకు సలహాలు ఇస్తున్నారు. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, యూసీడీ, ఇంజినీరింగ్ తదితర విభాగాలలో ఆధునీకరణ పనులు జోరుగా సాగుతున్నాయి. జోనల్ కమిషనర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. ఇక్కడున్న ఆయా విభాగాలకు రోజూ అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. ముఖ్యంగా ఇక్కడున్న సౌకర్యం కేంద్రంలో ప్రజలు పన్నులు చెల్లిస్తుంటారు. త్వరలోనే ఈ పనులు పూర్తవుతాయని జోనల్ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. రూ.50 లక్షలతో ఈ పనులు చేపట్టామన్నారు.

దర్యాప్తునకు వినతి

అల్లిపురం : జీవీఎంసీ 98వ వార్డులో మొక్కలకు నీరు పోసేందుకు 11 మంది కాంట్రాక్టర్లు 900 ట్రిప్పులు తిరిగి.. 2600 ట్రిప్పులు తిరిగినట్లు చెబుతూ రూ. 60 లక్షలు కాజెయ్యాలని చూస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు జీవీఎంసీ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ వ్యవహారంలో అధికారులు సహకరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ట్రిప్పుల అంశంలో జీపీఎస్ నమోదు చేయగా కేవలం 900 ట్రిప్పులు మాత్రమే తిరిగినట్లు బయటపడినట్లు తెలిపారు. నగర ప్రజలు పన్నుల రూపంలో చెల్లిస్తున్న డబ్బును కాంట్రాక్టర్లతో చేతులు కలిపి దోచుకుంటున్న కొందరు అధికారులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రజాధనాన్ని కాపాడాలని సీపీఐ తరఫున కోరుతున్నట్లు పైడిరాజు వినతిపత్రంలో పేర్కొన్నారు.

రాగిజావ పట్ల విద్యార్థుల అనాసక్తి



ముక్కుపోయి చెడువాసనతో కూడిన రాగిపిండి



ఇసుకతో నిండిన బెల్లం

- ముక్కుపోయిన పిండి.. ఇసుకతో నిండిన బెల్లంతో తయారు చేయటమే కారణం

డాబాగార్డెన్స్ : శనివారం పాతనగరంలోని ఓ మున్సిపల్ పాఠశాలలో అందజేసిన రాగి జావను విద్యార్థులు తిరస్కరించారు. దీనికి కారణం పాడైన బెల్లం.. ముక్కుపోయిన పిండితో దానిని తయారు చేయటమే. పాఠశాలకు అందించిన రాగి, బెల్లం పాడైపోవడంతో ఈ సమస్య ఉత్పన్నం అయింది. దీంతో విద్యార్థులు ఆ రాగి జావ తాగేందుకు ఆసక్తి చూపలేదు. ఈ నెల 13న పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పాఠశాల పిల్లలకు వారానికి మూడు సార్లు రాగిజావ ఇవ్వనున్నారు. అయితే పాఠశాల ప్రారంభమైన రోజునే పంపిణీ చేసిన రాగిపిండి పూర్తిగా ముక్కుపోయి చెడు వాసన వచ్చింది. బెల్లంలో కూడా ఇసుక ఉండడంతో విద్యార్థులు రాగిజావను తాగేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు 'సాక్షి' దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు అందించే రాగి పిండి, బెల్లం తనిఖీ చేసి పాఠశాలలకు పంపిణీ చేస్తే బాగుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఈదురు గాలులకు విరిగి పడిన చెట్టు కొమ్మలు



డీఆర్ఎం కార్యాలయం రోడ్డులో విరిగిపడిన చెట్టుకొమ్మలు

అల్లిపురం : రోజంతా భానుడు తన ప్రతాపంతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాడు. శనివారం సాయంత్రం ఈదురు గాలులు వీచి.. చిరు జల్లులు పడటంతో వాతావరణం చల్లబడింది. ఈ సందర్భంగా వీచిన గాలులకు దొండపర్తి నుంచి అల్లిపురం వెళ్లే దారిలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కుటుంబ సభ్యుల చెంతకు బిచ్చగాళ్ల తరలింపు



ఆర్పీఎఫ్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా రెస్క్యూ చేసి గుర్తించిన బిచ్చగాళ్లు

అల్లిపురం : రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, ఏయూటీడీ సిబ్బంది సంయుక్తంగా శనివారం రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి 11 మందిని షెల్టర్‌కు తరలించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. షెల్టర్‌కు తరలించిన వారిలో కొరదా అప్పలనాయుడు (వైజాగ్), ఎస్.సురేష్ (మధురవాడ), ఎల్.నాగేశ్వరరావు (అనకాపల్లి), రవీంద్ర (ఒడిశా), పాపి (ఒడిశా), కంబు (ఒడిశా), పి.నాగేశ్వరరావు (పెందుర్తి), జునియా (బీహార్), వి.పద్మ (గాజువాక), పైడమ్మ (శ్రీకాకుళం), మాలతి (ఒడిశా) ఉన్నట్లు తెలిపారు. వీరిలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో భిక్షాటన చేస్తున్న వారే అధికంగా ఉన్నారన్నారు. ఒక వ్యక్తి మాత్రం ఇంట్లో గొడవ పడి వచ్చి రైల్వే స్టేషన్‌లో ఉంటున్నాడని వీరందరినీ మందలించి, కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

శ్రీశ్రీ రచనలు స్ఫూర్తిదాయకం



శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) రచనలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. శనివారం జరిగిన మురళీనగర్ వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీ పుట్టిన గడ్డగా విశాఖ పునీతమైందన్నారు. ఆయన విప్లవాత్మక రచనలు సామాజిక మార్పునకు దోహదపడ్డాయన్నారు. ముందుగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యవర్గ సమావేశంలో రానున్న నెలలో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై సభ్యులు చర్చించారు. ఈ నెల 30న అపోలో హాస్పిటల్స్ నేతృత్వంలో మెగా ఉచిత వైద్య శిబిరం, జూలై 1న నిమ్మగడ్డ బుచ్చయ్యకు 91వ జన్మదినాన్ని పురస్కరించుకుని సత్కారం, 4న అల్లూరి సీతారామరాజు జయంతి, 6న సాయంత్రం 6 గంటలకు నెలవారీ సమావేశం, వాకర్స్ ఇంటర్నేషనల్ సొంత భవనం నిర్మాణానికి సభ్యత్వ నిధి ద్వారా లక్ష రూపాయలు విరాళం ఇవ్వాలని నిర్ణయించారు. శనివారం పుట్టిన రోజు జరుపుకున్న పూర్వాధ్యక్షుడు, వాకర్స్ జిల్లా 101 ఎలెక్ట్ గవర్నర్ కె.ద్వారకానాథ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, కె.ద్వారకానాథ్, కె.జి.కృష్ణారావు, ఎ.భాస్కరరావు, కార్యదర్శి పి.చెల్వారాజు, కోశాధికారి జె.కూర్మారావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, ఉపాధ్యక్షుడు ఎ.వి.సుబ్బారావు, ఎం.రామకృష్ణ, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన





కూచిపూడి నృత్యంతో అలరిస్తున్న చిన్నారి.. నృత్యంలో శిక్షణ పొందిన విద్యార్థినులు

సీతంపేట: విశాఖ సాహిత్య కళా సమితి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి నృత్యోత్సవాలు ప్రేక్షకులను అలరించాయి. శనివారం పలువురు చిన్నారులు వివిధ రీతుల్లో చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గాజువాకకు చెందిన విశాఖ సాహిత్య కళా సమితి ఆధ్వర్యంలో నాట్యగురువు టి.సందీప్ కుమార్ విద్యార్థినులకు కూచిపూడి నృత్యంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తయిన సందర్భంగా పౌర గ్రంథాలయంలో వేసవి నృత్యోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు, కూచిపూడి కళాకారులకు నందీశ్వర, ఐరావత పురస్కారాలు ప్రదానం చేశారు.

భారతీయ సంప్రదాయ ఔషధం ఆయుర్వేదం

బీచ్‌రోడ్డు: ఆయుర్వేదం అనేది శరీరం, మనస్సు, ఆత్మ సమతుల్యతను కాపాడుకునే లక్ష్యంతో భారతదేశంలో పుట్టిన సంప్రదాయ ఔషధమని ఆయుర్వేద వైద్యుడు గౌతమన్ కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఆయుర్వేదంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలోని వివిధ చికిత్సల్లో వర్మ థెరపీ ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. నియమబద్ధ జీవితం, ఆరోగ్యకరమైన ఆహారంతో మంచి ఫలితాలు వస్తాయన్నారు.

బస్సులిలా.. ప్రయాణమెలా?



కిక్కిరిసిన బస్సు ఎక్కే ప్రయత్నంలో విద్యార్థులు

- ఉదయం.. సాయంత్రం జనంతో కిటకిట
- వేలాడుతూనే ప్రయాణిస్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్ : పెరిగిన జనాభాకు అనుగుణంగా రవాణా సౌకర్యాలు మెరుగుపడకపోతే ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ఈ విషయం దక్షిణ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లోని బస్టాపుల్లో బస్సుల కోసం వేచి చూసే వారిని చూస్తే ఇట్టే అర్థమవుతుంది. సాయంత్రం 4 దాటితే ఆశీలమెట్ట, ద్వారకానగర్ తదితర ప్రాంతాల మీదుగా ప్రయాణించే బస్సులు ఎక్కాలంటే ఎవరికైనా హడలే. ఆ సమయంలో బస్టాపుల్లో వందల సంఖ్యలో ప్రయాణికులు నిరీక్షిస్తూ ఉంటారు. వారిలో విద్యార్థులే ఎక్కువగా కనిపిస్తారు. ఆ సమయంలో వారిలో సగం మంది ఎక్కినా బస్సు కిక్కిరిసిపోతుంది. పాపం ఆ విద్యార్థులు అంత రద్దీలోనూ ప్రమాదమని తెలిసినా ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేస్తూ గమ్యస్థానాలకు చేరుకుంటూ ఉంటారు. ఈ రూట్లలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు బస్సుల్లో వేలాడుతూ ప్రయాణించాల్సిందే.

ప్రమాదమని తెలిసినా..

సమయానికి బస్సులు రావు. వచ్చినవి కిక్కిరిసి ఉంటాయి. ఫలితంగా ఊపిరాడని బస్సుల్లో ప్రయాణం విద్యార్థులకు నరక ప్రాయమవుతోంది. ఫుట్‌బోర్డ్ ప్రయాణం ప్రమాదమైనా ప్రత్యామ్నాయం లేక అలాగే ప్రయాణిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో విద్యార్థులను బస్సుల్లో పంపిస్తున్న వారి తల్లిదండ్రులు.. బిడ్డలు ఇంటికి వచ్చే వరకు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని నిరీక్షిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఆశీలమెట్ట, ద్వారకానగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పాఠశాలలు, కళాశాలలతో పాటు కోచింగ్ సెంటర్లు ఉన్నాయి. చాలా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు కూడా అక్కడే కనిపిస్తాయి. దీంతో విద్యార్థులు విద్యా సంస్థలకు వెళ్లాలన్నా.. ఉద్యోగులు పని ప్రాంతాలకు వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సులనే ఆశ్రయిస్తారు. ఆ సమయంలో ట్రాఫిక్ కూడా ఎక్కువగా ఉండటంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. అనుకున్న సమయానికి చేరాలంటే గంట ముందే బయల్దేరాల్సి ఉంటుంది.



బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు



బస్సులు రాకపోవడంతో లిఫ్ట్ అడుగుతున్న చిన్నారులు

ఎక్కువ బస్సులు నడపాలి..

ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు ఎక్కువగా నడపాలని పలువురు కోరుతున్నారు. ఉదయం పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలకు వెళ్లేటప్పుడు, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు బస్సులు ఎక్కువగా నడిపితే అవస్థలు తొలగుతాయని ఉద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని భార్గవి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ఏయూటీడీ సంస్థ కార్యదర్శి వాసు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి జోడుగుళ్లపాలేనికి చెందిన డి.భార్గవి పదో తరగతిలో ఉత్తీర్ణురాలైంది. ఇంటర్‌లో చేరాలనుకునే సమయంలో అనారోగ్యానికి గురైంది. ఆమె శరీరంలో మల్టీ ఆర్గాన్స్ పాడయ్యాయి. దీంతో పేద కుటుంబానికి చెందిన ఆమెకు తల్లిదండ్రులు వైద్యం చేయించలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ రూ.30 వేలు, మిత్ర మండలి సభ్యులు మరో 29 వేల రూపాయలను ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు ద్వారా శనివారం జోడుగుళ్లపాలెంలో ఉన్న భార్గవి తల్లిదండ్రులకు అందజేశారు. దీంతో ఈఏఎస్ శర్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. భార్గవి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.